# అధికారం పోయాకే దివ్యాంగులు గుర్తొచ్చారా

**బీఆర్ఎస్ మ్యానిఫెస్టో హామీల్లో ఒక్కటైనా అమలు చేశారా?**
**దివ్యాంగుల సమావేశం పెట్టి హరీశ్‌రావు పచ్చి అబద్ధాలు మాట్లాడారు..**
**మా పాలనపై చర్చకు సిద్ధం"**
**సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్**



**హైదరాబాద్, ఆగస్టు 30,(నవగీతం)** "పదేళ్ల పాటు మేమే రాజులం.. మేమే మంత్రులం.. మాకు ఎదురులేదన్నట్లుగా వ్యవహరించిన బీఆర్ఎస్ నేతలకు ఇప్పుడు దివ్యాంగులు గుర్తుకొచ్చారా?" అని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రశ్నించారు. 2014, 2018, 2023 ఎన్నికల మ్యానిఫెస్టోల్లో దివ్యాంగులకు ఇచ్చిన హామీల్లో ఒక్కటైనా పూర్తిస్థాయిలో నెరవేర్చకుండా.. అధికారం కోల్పోయిన తర్వాత దివ్యాంగుల సంక్షేమంపై బీఆర్ఎస్ నేతలు మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ఆదివారం సీఎల్పీ మీడియా సెంటర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.. దివ్యాంగుల సమావేశం ఏర్పాటు చేసి మాజీ మంత్రి హరీశ్‌రావు పచ్చి అబద్ధాలు మాట్లాడారని తీవ్రంగా ఖండించారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డిని ఏకవచనంతో సంబోధిస్తూ విమర్శలు చేయడాన్ని తప్పుబట్టారు. దివ్యాంగులను బలవంతంగా సమావేశానికి తీసుకువచ్చి రాజకీయ ప్రసంగాలు వినిపించడం సరికాదన్నారు.

"దివ్యాంగుల సమస్యలపై మాట్లాడాలంటే ఆధారాలతో మాట్లాడాలి. రాజకీయ ప్రయోజనాల కోసం వారిని ఉపయోగించుకోవడం సరికాదు. హరీశ్‌రావు చేసిన విమర్శలను తీవ్రంగా ఖండిస్తున్నాం" అని మంత్రి అడ్లూరి స్పష్టం చేశారు.

**పదేళ్లలో దివ్యాంగుల కోసం ఏం చేశారు?**

బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో దివ్యాంగుల సంక్షేమంపై ఏనాడైనా సమగ్రంగా ఆలోచించారా అని మంత్రి ప్రశ్నించారు. 2014, 2018, 2023 ఎన్నికల మ్యానిఫెస్టోల్లో దివ్యాంగులకు పలు హామీలు ఇచ్చినప్పటికీ.. వాటి అమలుపై బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పలేదన్నారు.

"అధికారంలో ఉన్నప్పుడు హామీలు ఇచ్చారు. పదేళ్లు గడిచిపోయాయి. ఇప్పుడు అధికారం పోయిన తర్వాత దివ్యాంగులపై ప్రేమ ఒలకబోస్తున్నారు. ఇది ప్రజలను నమ్మించే ప్రయత్నం తప్ప మరొకటి కాదు" అని విమర్శించారు.

**రూ.50 కోట్లతో సహాయ పరికరాలు**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దివ్యాంగుల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చిందని మంత్రి తెలిపారు. రూ.50 కోట్లతో వాహనాలు, బ్యాటరీ వెహికిల్స్‌తో పాటు వివిధ సహాయ పరికరాలను దివ్యాంగులకు అందించామని చెప్పారు.వచ్చే ఏడాది మరో రూ.50 కోట్లతో సహాయ వాహనాలు, అవసరమైన పరికరాలను అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. దివ్యాంగులు స్వయం ఆధారితంగా జీవించేలా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.

**ఇందిరమ్మ ఇళ్లలో దివ్యాంగులకు ప్రాధాన్యం**

దివ్యాంగులకు గృహ భద్రత కల్పించేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకంలో వారికి ప్రాధాన్యం కల్పించామని మంత్రి అడ్లూరి తెలిపారు. పేదలకు సొంతింటి కలను సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు.

బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అప్పులపాలు చేసినప్పటికీ.. పేదల కోసం తగిన స్థాయిలో గృహ నిర్మాణం చేపట్టలేదని విమర్శించారు. ఇందుకు భిన్నంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున కేటాయించిందన్నారు.

"కేటీఆర్, హరీశ్‌రావు గుండె మీద చేయి వేసుకుని చెప్పాలి.. మీ పదేళ్ల పాలనలో పేదలకు ఎన్ని ఇళ్లు కట్టించారు? మా ప్రభుత్వం ఎన్ని ఇళ్లు కేటాయించింది?" అని మంత్రి ప్రశ్నించారు.

**పింఛన్లపై స్పష్టమైన హామీ**

దివ్యాంగులకు పింఛన్ల విషయంలో ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు. కొత్తగా అర్హులైన దివ్యాంగులకు పింఛన్లు మంజూరు చేస్తున్నామని చెప్పారు. దివ్యాంగులకు రూ.6,000 పింఛన్ అందించాలన్న ప్రభుత్వ నిబద్ధతలో ఎలాంటి మార్పు లేదన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు, ఆర్థిక వనరుల సమీకరణ కారణంగా పింఛన్ల పెంపులో కొంత ఆలస్యం జరుగుతోందని తెలిపారు.

**పూర్తి అంగవైకల్యంతో పుట్టే చిన్నారులకు 'బాల్ భరోసా'**

పూర్తి అంగవైకల్యంతో జన్మించే చిన్నారులకు అవసరమైన వైద్య సేవలను అందించేందుకు 'బాల్ భరోసా' పథకం ద్వారా ప్రభుత్వమే పూర్తి వ్యయాన్ని భరిస్తూ వైద్యం అందిస్తోందని మంత్రి తెలిపారు. చిన్నారుల ఆరోగ్యం, భవిష్యత్తు విషయంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందన్నారు.

**దివ్యాంగులకు ఉచిత ఆర్టీసీ ప్రయాణంపై చర్చలు**

దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించే అంశంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చిస్తున్నామని మంత్రి తెలిపారు. సాధ్యాసాధ్యాలను పరిశీలించి దివ్యాంగులకు మరింత ప్రయోజనం కలిగించే నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

**బీఆర్ఎస్ మ్యానిఫెస్టో హామీలపై కేసీఆర్ సమాధానం చెప్పాలి**

బీఆర్ఎస్ ప్రభుత్వం 2014, 2018 ఎన్నికల సమయంలో ఇచ్చిన అనేక హామీలను అమలు చేయలేదని మంత్రి విమర్శించారు. నిరుద్యోగ యువతకు నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చి పక్కన పెట్టారని ఆరోపించారు.ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి లక్ష ఎకరాలకు నీరు అందిస్తామని చెప్పి. ఆ హామీని కూడా నెరవేర్చలేదన్నారు. కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య హామీ ఏమైందని ప్రశ్నించారు. కొత్త యూనివర్సిటీలు ఏర్పాటు చేస్తామని చెప్పినా.. కనీసం ఉస్మానియా విశ్వవిద్యాలయానికి అవసరమైన నిధులు ఇవ్వలేదని విమర్శించారు. అదే సమయంలో ప్రైవేటు యూనివర్సిటీల ఏర్పాటుకు అనుమతులు ఇచ్చారని ఆరోపించారు.

ఎస్టీలకు 12 శాతం రిజర్వేషన్లు, చట్టసభల్లో మహిళలకు 30 శాతం రిజర్వేషన్లు, జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు వంటి హామీలను కూడా బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేయలేదని మంత్రి అన్నారు.

"మ్యానిఫెస్టోలో హామీలు ఇచ్చి అమలు చేయని అంశాలు




ఎన్నో ఉన్నాయి. వాటికి కేసీఆర్ సమాధానం చెప్పాలి. దివ్యాంగుల విషయంలోనూ బీఆర్ఎస్ ప్రభుత్వం ఇదే వైఖరి అవలంబించింది" అని మంత్రి అన్నారు.

**ప్రజా ప్రభుత్వంలో సంక్షేమానికి పెద్దపీట**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రేషన్ కార్డులు మంజూరు చేసి.. సన్నబియ్యం అందిస్తున్నామని మంత్రి తెలిపారు. పేద కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని చెప్పారు.విద్యా రంగంలో మౌలిక వసతులను బలోపేతం చేసేందుకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని చెప్పారు.

**1000 రోజుల వైఫల్యాలపై చర్చకు సిద్ధం**

కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల వైఫల్యాలపై పోరాటం చేస్తామని కేటీఆర్ ప్రకటించడంపై మంత్రి స్పందించారు. తమ ప్రభుత్వ పాలనపై చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు."వెయ్యి రోజుల వైఫల్యాలంటున్నారు. మేము మా పాలనపై చర్చకు సిద్ధంగా ఉన్నాం. అసెంబ్లీకి రండి.. అక్కడే చర్చిద్దాం. మీ పదేళ్ల పాలన, మా ప్రభుత్వ పాలనపై ప్రజల సమక్షంలో చర్చ జరగాలి" అని మంత్రి అడ్లూరి సవాల్ చేశారు.

**అధికారం పోయాకే దివ్యాంగులు గుర్తొచ్చారా?**

పదేళ్లపాటు అధికారంలో ఉన్నప్పుడు దివ్యాంగుల సంక్షేమం కోసం బీఆర్ఎస్ ఏనాడూ సమగ్రంగా ఆలోచించలేదని మంత్రి అన్నారు. ఇప్పుడు ప్రభుత్వం పోయిన తర్వాత దివ్యాంగులు గుర్తుకు రావడం రాజకీయ అవకాశవాదమేనని విమర్శించారు.

"ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో దివ్యాంగుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది. మా మ్యానిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని దశలవారీగా నెరవేరుస్తాం. దివ్యాంగులకు అండగా నిలవడమే కాదు.. వారికి ఆత్మగౌరవంతో జీవించే హక్కును కల్పించేందుకు ప్రభుత్వం పనిచేస్తుంది" అని అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ స్పష్టం చేశారు.

"హరీశ్‌రావు గారు.. రాజకీయ ఆరోపణలు చాలించండి. మీ పదేళ్ల పాలనలో దివ్యాంగుల కోసం ఏం చేశారో చెప్పండి. మా రెండున్నరేళ్ల పాలనలో ఏం చేశామో మేము చెబుతాం. అసెంబ్లీకి రండి.. ప్రజల ముందే చర్చిద్దాం' అని మంత్రి అడ్లూరి సవాల్ విసిరారు.

# ఆపదలో నేనున్నానంటూ.. బాధితులకు ఎమ్మెల్యే సత్యం బాసట

**రోడ్డు ప్రమాద విషయం తెలియగానే ఆసుపత్రికి చేరుకుని పరామర్శ..**
**క్షతగాత్రులకు మెరుగైన వైద్యం కోసం కలెక్టర్‌కు ఆదేశం..**
**మృతురాలి కుటుంబానికి పరిహారం అందించాలని సీఎంఓకు ఫోన్..**
**ఎమ్మెల్యే విజ్ఞప్తిపై వెంటనే స్పందించిన కలెక్టర్..**
**బాధితులకు ప్రత్యేక వైద్య సేవలు**





**కరీంనగర్, ఆగస్టు 30,(నవగీతం)** ఆపదలో ఉన్న ప్రజలకు తాను అండగా ఉంటానని చొప్పదండి ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు డా. మేడిపల్లి సత్యం మరోసారి చాటుకున్నారు. రోడ్డు ప్రమాదం జరిగిన విషయం తెలియగానే ఏమాత్రం ఆలస్యం చేయకుండా స్పందించి ఆసుపత్రికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించారు. బాధిత కుటుంబాలకు ధైర్యం చెప్పడంతో పాటు మెరుగైన వైద్యం, ప్రభుత్వ సహాయం అందేలా అధికారులను అప్రమత్తం చేశారు. కరీంనగర్ జిల్లా గంగాధర మండలం మంగంపేట గ్రామం బీసీ కాలనీకి చెందిన రైతు కూలీలు ఆదివారం పత్తి చేనులో వ్యవసాయ పనులకు ఆటోలో వెళ్తుండగా గంగాధర--కరీంనగర్ ప్రధాన రహదారిపై ర్యాకం లక్ష్మయ్య ఫంక్షన్ హాల్ సమీపంలో ప్రమాదం చోటుచేసుకుంది. వెనుక నుంచి వచ్చిన కోళ్ల వ్యాన్ ఆటోను ఢీకొనడంతో పలువురు గాయపడ్డారు. ఈ ప్రమాదంలో లింగాల దేవమ్మ (55) తీవ్రంగా గాయపడి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందారు. మరో బాధితురాలి పరిస్థితి విషమంగా ఉండటంతో కరీంనగర్‌లోని మెడికవర్ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు.

ప్రమాద విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం వెంటనే సివిల్ ఆసుపత్రికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా మెరుగైన వైద్య సేవలు, అవసరమైన ప్రత్యేక చికిత్స అందించాలని జిల్లా కలెక్టర్‌కు ఫోన్ ద్వారా సూచించారు.

ఎమ్మెల్యే సూచనలపై జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి సంబంధిత వైద్యాధికారులతో మాట్లాడారు. క్షతగాత్రులకు అత్యుత్తమ వైద్య సహాయం అందించాలని, వారి ఆరోగ్య పరిస్థితిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, అవసరమైన అన్ని వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

అదేవిధంగా మృతురాలు లింగాల దేవమ్మ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరఫున పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ సీఎంఓ కార్యాలయానికి ఫోన్ చేసి విజ్ఞప్తి చేశారు. ఆపద సమయంలో ప్రభుత్వం బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తుందని భరోసా కల్పించారు.ప్రజలకు ఏ కష్టం వచ్చినా వెంటనే స్పందిస్తూ, బాధితులకు అవసరమైన సహాయం అందేలా అధికార యంత్రాంగాన్ని సమన్వయం చేయడంలో ఎమ్మెల్యే సత్యం చూపిన చొరవ స్థానికంగా ప్రశంసలు అందుకుంటోంది. ప్రమాదం జరిగిన వెంటనే స్పందించి ఆసుపత్రికి చేరుకోవడం, బాధితులను పరామర్శించడం, మెరుగైన వైద్యం కోసం కలెక్టర్‌ను అప్రమత్తం చేయడం, మృతురాలి కుటుంబానికి పరిహారం కోసం సీఎంఓ స్థాయిలో మాట్లాడటం ద్వారా ప్రజా ప్రతినిధిగా తన బాధ్యతను చిత్తశుద్ధితో నిర్వర్తించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంట మంగంపేట సర్పంచ్ లింగాల లింగయ్య, ఉప సర్పంచ్ నల్ల హనుమంతు, కాంగ్రెస్ నాయకులు బైరిశెట్టి సంపత్ తదితరులు ఉన్నారు.

## కొడిమ్యాల జామా మసీద్ కమిటీ నూతన కార్యవర్గం ఎన్నిక



**కొడిమ్యాల ఆగస్టు 30.(నవగీతం)** కొడిమ్యాల మండల కేంద్రంలోని జామా మసీద్ కమిటీ నూతన కార్యవర్గాన్ని కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.అధ్యక్షుడిగా మహ్మద్ రోషన్, జనరల్ సెక్రటరీగా అజీజ్ ఖాన్, వైస్ ప్రెసిడెంట్‌గా షాకీర్ ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మహ్మద్ రోషన్ మాట్లాడుతూ.. తమపై నమ్మకంతో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్న జామా మసీద్ కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. మసీద్ అభివృద్ధి, నిర్వహణకు కమిటీ సభ్యుల సహకారంతో సమష్టిగా కృషి చేస్తామని చెప్పారు. మసీద్ అభివృద్ధికి అవసరమైన కార్యక్రమాలను చేపట్టి, భక్తులు, ముస్లిం సోదరులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

## బర్కత్‌పుర యూత్ అధ్యక్షుడిగా తమీజుద్దీన్

ఆదివారం జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నిక





**మెట్‌పల్లి,ఆగస్టు 30,(నవగీతం)** బర్కత్‌పురలో యూత్ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో నూతన అధ్యక్షుడిగా తమీజుద్దీన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం యూత్ సభ్యులు, నాయకులు నూతన అధ్యక్షుడిని శాలువాలతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ యువత ఏకతాటిపైకి వచ్చి సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని సూచించారు. యువతలో ఉన్న ప్రతిభను వెలికితీసి, విద్య, క్రీడలు, ఉపాధి, సామాజిక సేవ తదితర రంగాల్లో ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు.నూతన అధ్యక్షుడు తమీజుద్దీన్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఏకగ్రీవంగా అధ్యక్షుడిగా ఎన్నుకున్న ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పదవి అనేది హోదా కోసం కాదని.. బాధ్యతను నిర్వర్తించేందుకు ఇచ్చిన అవకాశంగా భావిస్తున్నానన్నారు. బర్కత్‌పుర యూత్ సభ్యులందరినీ కలుపుకుని ఐకమత్యంతో ముందుకు సాగుతానని తెలిపారు.యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించేలా ప్రోత్సహిస్తామని తెలిపారు. ప్రతిభ ఉన్న క్రీడాకారులను గుర్తించి వారికి అవసరమైన ప్రోత్సాహం అందించేందుకు కృషి చేస్తానన్నారు.మన కోసం మాత్రమే కాదు.. మన చుట్టూ ఉన్న సమాజం కోసం కూడా ఆలోచించే యువతే నిజమైన యువత' అనే ఆలోచనతో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని ఆయన కోరారు. తనకు అప్పగించిన బాధ్యతను నిబద్ధతతో నిర్వహిస్తూ యూత్ సభ్యుల నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని నూతన అధ్యక్షుడు తమీజుద్దీన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మొహమ్మద్ అహ్మద్, యూసుఫ్ అలీ, కౌన్సిలర్ ఆజీమ్, రాహూఫ్, షకీల్, జాకీర్, ఇస్మాయిల్, ముజ్జు, రియాజ్, వసీం, అజీమ్, మతీన్, యూత్ సభ్యులు, స్థానిక యువకులు, పెద్దలు తదితరులు పాల్గొని నూతన అధ్యక్షుడు తమీజుద్దీన్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## చింతల్‌లో శ్రీ భక్త హనుమాన్ దేవస్థానంలో ప్రతిష్ఠాపన మహోత్సవం



**వరంగల్ :** ప్రత్యేక పూజల్లో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర నాయకులు వరంగల్ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు గారు వరంగల్ తూర్పు నియోజకవర్గం చింతల్‌లోని శ్రీ భక్త హనుమాన్ దేవస్థానంలో నవగ్రహ, ధ్వజస్తంభం, ఆలయ శిఖర ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకులు వరంగల్ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ శ్రీ ఎర్రబెల్లి ప్రదీప్ రావు గారు ఆలయానికి విచ్చేసి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి ప్రదీప్ రావు గారు మాట్లాడుతూ.. శ్రీ భక్త హనుమాన్ స్వామివారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఆలయ అభివృద్ధికి, ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. ఈ మహోత్సవంలో మండల శ్రీకాంత్, మర్రి శ్రీనివాస్, ఆలయ కమిటీ సభ్యులు వీర ప్రతాప్, సుగుణకర్ రావు, కేవీకే రాజు,చంద్రశేఖర్, మధు, సమ్మిలు, శ్రీధర్, గోపి, సాగర్, అర్చకులు, భక్తులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

